# దేశమును ప్రేమించుమన్నా!

సామాన్యుడు దేశభక్తికోసం పెద్ద బజారంతా వెతికాడు. అంతా బ్లాకుమార్కెట్టు. ఎక్కడా దొరకలేదు. అతను దేశభక్తుణ్ణివెతికిపట్టుకుని అడిగాడు, ఎక్కడ దొరుకుతుందని. దేశభక్తుడు ఖద్దరు టోపీ చేతిలోకితీసుకుని సామాన్యుణ్ణి అనుమానంగా ఒకసారి ఎగాదిగా పరకాయించి చూసి, 'నువ్వు ఏ ఇజం' అని అడిగాడు. సామాన్యుడు 'నేను ఏ ' ఇజమూ' ఎరగనే!' అన్నాడు అమాయకంగా. అతనికి ఆశ్చర్యంగా ఉంది ఆ ఇజం ఏమిటోనని. దేశభక్తుడు శాంతించిన హృదయ స్పందనానికి గుర్తుగా ఖద్దరు టోపీ నెత్తిన బెట్టుకుని, 'అయితే చిన్న బజారు స్వదేశవస్తు విక్రయశాలలో దేశభక్తి కంట్రోలు రేటుకి అమ్ముతున్నారు. అక్కడికి వెళ్లు, దొరుకుతుంది' అని చెప్పి వెళ్లిపోయినాడు.

సామాన్యుడు దేశభక్తికి మూల్యం తెలియక ఇదివరకే అవస్థపడ్డాడు గాబట్టి స్వదేశ వస్తువిక్రయశాలలో ప్రవేశిస్తూనే పది రూపాయలనోటు చేతబుచ్చుకుని విక్రయశాల యజమాని త్యాగశీలం గారిని కనుక్కున్నాడు ' ఓ సవాశేరు దేశభక్తి ఎంత' అని.

త్యాగశీలంగారు, ఇంకెవ్వరికో అప్పుడే 'దేశసేవ' ఇచ్చి, సామాన్యుడి వంక చూసి, ' ఇంకా తెలీదుటయ్యా దేశభక్తి ధరా?' అని గదమాయించాడు.

'తెలీకనే కదండి అడుగుతూంటా!' అన్నాడు సామాన్యుడు కాస్త లజ్జపడి.

'నువ్వు వొడికిన నూలు వీశెడు తెస్తే, సవాశేరు దేశభక్తి ఇస్తాం. అదిగో బోర్డు రాసి లేదుటయ్యా? చూడు కావలిస్తే.

'బోర్డు చూశానండి. ఆ అక్షరాలేవో బోధపళ్లేదు లెండి. అయినా, నాకు నూలు వొడికే తీరిక లేదే. నాకు దేశభక్తి లేనట్టేనా?' సామాన్యుడు బాధగా, ఆశ్చర్యంతో కనుక్కున్నాడు.

'మంచి బేరమే తెచ్చావయ్యా మహానుభావా! హిందీబోర్డు తెలీదంటున్నావు. నూలు వొడక లేనంటున్నావు, పదపద' అన్నాడు త్యాగశీలం గారు చిరాకుగా, సామాన్యుడు తలగోక్కుంటూ కొంప చేరుకున్నాడు!

*(జనవరి 28, 1949, తెలుగు స్వతంత్ర)*